www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025

5

అన్నమయ్య



'ఆదిత్య' విద్యార్థులకు బంగారు పతకాలు


బంగారు పతకాలు అందుకుంటున్న సాజిద్

ప్రజాశక్తి-మదనపల్లె : ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు అనంతపురం జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ నిర్వహించిన స్నాతకోత్సవంలో విశేష గౌరవాన్ని అందుకున్నారు. అకడమిక్ రీతిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. 2020-24 బ్యాచ్‌కు చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎం.రమ్యలక్ష్మి, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎస్.సాజిద్ మురాద్ అత్యధిక శాతం మార్కులతో విశ్వవిద్యాలయం మొత్తంలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్స్‌కు అర్హులయ్యారు. వారిద్దరూ గౌరవనీయ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, డీన్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ఈ విజయాన్ని వారు గర్వకారణంగా పేర్కొన్నారు.

వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన కారు

ముగ్గురు దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు
- మృతులందరూ కర్ణాటక వాసులే
- కేటరింగ్ కోసం వస్తుండగా ప్రమాదం
- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం


మృతులు చలపతి, లోకేష్, శివానంద (ఫైల్ ఫొటోలు)


క్రేన్ సాయంతో బావిలో నుంచి కారును వెలికి తీయిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పీలేరు

పుట్టింది కర్ణాటక, నివాసముంటూందీ కర్ణాటకలోని వేర్వేరు ప్రాంతాల్లో. అందరివీ సామాన్య కుటుంబాలే... అందరిదీ ఒకే వృత్తి. ఒక్కటే ఉపాధి. ప్రాంతంతో పనిలేదు. భాష అవసరమే లేదు. ఊరు ఏదున్నా, ఉపాధికి ఎంత దూరమైనా బతుకుదెరువు కోసం వెళ్లి వంటలు వండటమే వారి వృత్తి. ఎక్కడ ఎలాంటి శుభకార్యాలైనా, ఆశుభ కార్యక్రమాలైనా పిలుపందుకుని అక్కడికి చేరుకుంటారు. కోరిన వంటలు రుచికరంగా వండి, వడ్డించి అందరి ఆకలి తీర్చడమే వారికి ఉపాధి. వారిలో వంట ఆర్డరు ఎవరు తీసుకున్నా సరే, కష్టానికి వచ్చిన ఫలితాన్ని సమంగా పంచుకుంటారు. వారి వారి కుటుంబాలను పోషించుకుంటూ, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుకుంటున్నారు. ఈ క్రమంలో... శనివారం తమిళనాడు రాష్ట్రంలోని హెూసూరులో ఓ శుభకార్యానికి హాజరై వంటావార్పు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పీలేరుకు చేరుకుని ఆదివారం మరో శుభ కార్యక్రమానికి వంటలు వండాల్సి ఉంది. అందుకోసం రాత్రికి రాత్రి శనివారం అర్ధరాత్రి హోసూరు నుంచి ఐదుగురు వంటవారు ఓ కారులో బయలుదేరారు. కారు నడపడం తెలిసిన ఇద్దరు వంటవారు దూరాన్ని బట్టి మార్చి మార్చి వాహనాన్ని నడుపుకుంటూ ఆదివారం తెల్లవారేసరికి పీలేరుకు చేరుకోవాల నుకున్నారు. వారు ప్రయాణం చేస్తున్న కారు సదుం-పీలేరు రహదారిపై పీలేరు మండలం, బాలంవారిపల్లి కురవపల్లి దాటుకుంది. వారు గమ్యం చేరడానికి మరో ఏడు కిలోమీటర్ల దూరం మాత్రమే మిగిలి ఉంది. అక్కడే మృత్యు అడ్డుపడి ఆ కారును వ్యవసాయ బావి వైపుకు దారి మళ్లించింది. కారు వెనుక సీటులో కూర్చున్న ఇద్దరు వ్యక్తులు మాత్రం తెరుచుకుని ప్రాణాలతో బయటపడ్డారు. మరో ముగ్గురు వ్యక్తులు కారులోనే చిక్కుకున్నారు. ఒడ్డుకు చేరుకున్న ఆ ఇద్దరు వ్యక్తులు తమ సహచరులను కాపాడుకోవడం కోసం చీకట్లో ఆ రోడ్డుపై వచ్చే వాహనాల కోసం ఎదురు చూశారు. చివరికి వచ్చిన ఓ వాహన దారుడి సహకారంతో అక్కడికి సమీపంలోని బి.కురవపల్లి గ్రామస్తులకు సమాచారం అందించి సాయం కోరారు. స్పందించిన గ్రామస్తులు పీలేరు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల పల్లె వాసులు కూడా ఘటన స్థలానికి చేరుకున్నారు. పీలేరు సిఐ యుగంధర్ తన సిబ్బందితో అక్కడికి వచ్చేశారు. పోలీసుల కథను మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... కర్నాటక రాష్ట్రంలోని చింతామణి, కోలార్, చిక్కబల్లాపూర్ జిల్లాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు పీలేరులో ఓ శుభకార్యానికి వంటలు వండడానికి కారులో వస్తూ పీలేరు-సదుం రహదారిలోని పీలేరు మండలం, బాలంవారిపల్లి పంచాయతీ, కురవపల్లి సమీపంలోని ఓ మలుపులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లి ప్రమాదానికి గురైందని సీఐ తెలిపారు. ఈ ఘటనలో చిక్కబళ్లాపూర్ జిల్లా, చింతామణి తాలూకా, ముతకడహళ్లికి చెందిన ఎన్.లోకేష్ (36), చాంద్రహళ్లికి చెందిన సిఎం శివానంద (44), కోలార్ జిల్లా, కోలారుకోలారు తాలూకా, సుగుటూరుకు చెందిన ఎన్.చలపతి (48) అనే ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. చాంద్రహళ్లికి చెందిన సి.వి.సునీల్, కోలారు తాలూకా ముతకనహళ్లికి చెందిన జి.తిప్పారెడ్డి (43) ప్రమాదం నుంచి బయటపడ్డారు. మృతులు ముగ్గురికి కూడా భార్యలు ఇద్దరేసి సంతానం ఉన్నారు. ఆయా కుటుంబాలను పోషించే వ్యక్తులు మృతి చెందడంతో వారి పరిస్థితి వీధిన పడినట్లైందని సమీప బంధువులు చెబుతున్నారు. మృతుడు లోకేష్‌కు భార్య చందన, 5వ తరగతి చదువుతున్న కుమార్తె అమూల్య, 3వ తరగతి చదివే కుమారుడు భాస్కర ఉన్నారని, మరో మృతుడు శివానందకు భార్య కవిత, ఎస్ఎస్ఎల్‌సి చదివే కుమార్తె చందన, ఐదవ తరగతి చదువుతున్న కుమారుడు భార్గవ ఉన్నారని, ఇంకో మృతుడు చలపతికి భార్య చైత్ర, 8వ తరగతి చదివే కుమారుడు వినీల్, 2వ తరగతి చదివే కుమార్తె వినుత ఉన్నారని తెలిసింది. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదంలో మృతి చెందిన చలపతి, లోకేష్, శివానంద


ప్రమాదం జరిగిన బావి దగ్గర సహాయక చర్యలు చేపడుతున్న స్థానికులు

మృతదేహాల తరలింపునకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఘటనా స్థలానికి చేరుకున్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మృతదేహాలను చూసి చలించి పోయారు. పోలీసులను అడిగి బాధితుల వివరాలు తెలుసుకున్న ఆయన మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించాలని సూచించారు. మృతదేహాలు వారి స్వగ్రామానికి తరలించడం కోసం అవసరమైన రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, బాలంవారిపల్లి మాజీ సర్పంచ్ సురేంద్రరెడ్డి, సిఐ యుగంధర్ పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు నిర్వహిస్తాం

- రాయలసీమ అభివృద్ధి, పార్టీ సిద్ధాంతాలపై చర్చిస్తాం
- 23 వేల మందితో ప్రతినిధుల సభ
- 13 నిర్వహణ కమిటీల ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపి రాష్ట్ర మహానాడు కార్యక్రమాన్ని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం కమలాపురం నియోజకవర్గం సికెదిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. పబ్బాపురంలోని మహానాడు వేదిక సమీపంలో ఆయన మాట్లాడుతూ 142 ఎకరాల్లో మహానాడు నిర్వహించనున్నామని తెలిపారు. దేశంలో యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మహానాడు నిర్వహణపై మీమాంసలో పడ్డామని, యుద్ధంలో ఆగిన నేపథ్యంలో మహానాడు నిర్వహించాలని భావించామని తెలిపారు. కో-ఆర్డినేషన్ కమిటీల సహకారంలో భాగంగా 13 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక నాయకత్వం సహకారంతో వేదిక సమస్యను పరిష్కరించుకున్నామని తెలిపారు. మంత్రుల సూచనలు, సలహాలను తీసుకుని ముందుకెళ్తున్నామని తెలిపారు. మొదటి రెండ్రోజులపాటు 23 వేల మందితో ప్రతినిధుల సభ ఉంటుందని చెప్పారు. ప్రధానంగా రాయలసీమ అభివృద్ధి, పార్టీ సిద్ధాంతాలు, పార్టీ ఐడియాలజీపై చర్చిస్తామన్నారు. పార్టీ కేడర్‌ను జాగృతం చేస్తామని తెలిపారు. వీరికి పార్టీ సిద్ధాంతాలను వివరించి చెప్తామన్నారు. తెలంగాణ రాజకీయ నాయకుల మూలాలు తెలుగుదేశం పార్టీతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. మూడవ రోజు భారీ బహిరంగ సభ నిర్వహి స్తామని తెలిపారు. 40 ఏళ్లుగా టిడిపి మహానాడు నిర్వహిస్తూ వస్తోందన్నారు. 13 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా కో-ఆర్డినేషన్ కమిటీ, స్టేజ్ మేనేజ్ మెంట్ కమిటీ, కో-ఆర్డినేషన్ క్యాంప్ కమిటీ, ట్రాన్స్‌పోర్టేషన్ కమిటీ, పార్కింగ్ కమిటీ, ఫుడ్ కమిటీ, వెన్యూ మానిటరింగ్ కమిటీ, క్రౌడ్ పుల్లింగ్ కమిటీ, బ్లడ్ బ్యాంకు డొనేషన్ క్యాంప్ కమిటీ, వాలంటరీస్ కమిటీ, రిజిస్ట్రేషన్, హైజీన్ కమిటీ, అకమిడేషన్ కమిటీ, ఫ్లవర్ డెకరేషన్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని 13 నియోజకవర్గాలు, ఆయా మండలాలు, పంచాయతీలు, గ్రామ కమిటీల సహకారంతో ఇంటింటికీ వెళ్లి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు సవిత, బిసి జనార్ధన్‌రెడ్డి, మంత్రులు అనిత, రాంప్రసాద్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎన్.వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, కిషోర్‌కుమార్‌రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డి, కుడా ఛైర్మన్ రూపానందరెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్ రామరాజు, ఆర్టీసి ఛైర్మన్ పూల నాగరాజు, ఖాదీ బోర్డు ఛైర్మన్ కె.కె.చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు భూపేష్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, ఓబులాపురం రాజశేఖర్, బి.టెక్ రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం, శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమిద్దామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎస్ఐఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక విశ్వ విద్యాసంస్థల వద్ద నిర్వహిస్తున్న రాష్ట్ర శిక్షణ తరగతుల క్లాసులకు రెండోరోజు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని ప్రయివేటీకరణ, కాషాయీకరణ, కేంద్రీకరణ, చేస్తోందన్నారు. ఈ పోకడ వల్ల దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉత్పన్నమవుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాల కోసం క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధమవుతూనే విద్యా రంగంలో వస్తున్న మార్పుల పైన అధ్యయనం చేయాలన్నారు. బట్టి పట్టే చదువులు కాకుండా ప్రశ్నించే చదువులు నేర్చుకోవాలని సూచించారు. చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపైన అధ్యయనం చేసే వారికే పోరాటం చేసే హక్కు ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సమాఖ్య మార్పు కోసం ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, డి.రమణ, జయబాబు, ఆఫ్రద్, సమీర్, ప్రేమ్, లతిప్, దీవాన్, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి విచ్చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లెలో కుండపోత వర్షం

జలమయమైన రోడ్లు - పొంగి పొర్లిన కాలువలు - ఇబ్బందులు పడ్డ ప్రజలు


నీటికుంటను తలపిస్తున్న బెంగళూరు బస్టాండ్

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో శనివారం అర్థరాత్రి కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి మదనపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్లు జలమయ మయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. ముఖ్యంగా బెంగళూరు బస్టాండ్ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీరు, మురుగునీరు రోడ్డుపై ప్రవహించాయి. రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో ఓ నీటి కుంటను తలపిస్తోంది. ప్రజలు, వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా దుకాణాదారులు కాలవలను ఆక్రమించి మరీ నిర్మాణాలు చేపట్టడంతో నీరు పోయే దారి లేక రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. ఇదంతా తెలిసినప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగా అధికారులు ఏమీ చేయలేని దుస్థితి నెలకొంది. వర్షం వచ్చినప్పుడు మాత్రం మున్సిపాలిటీ వర్కర్లు రోడ్డుపై ప్రవహించే నీటిని కష్టపడి కాలువల్లో పారే విధంగా ప్రయత్నం చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కార మార్గాలు చూపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, నిమ్మనపల్లి రోడ్డు సర్కిల్, ఎన్టిఆర్ సర్కిల్ తదితర ప్రధాన కూడల్లో నీరు భారీగా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువల పై అక్రమ నిర్మాణాలను తొలగించి, వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా కాలువల్లో ప్రవహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


రిటైర్డ్ డిఎస్‌పి నారాయణ స్వామిరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

రిటైర్డ్ డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఫ్రెండ్లీ పోలీస్‌కు చిరునామా రిటైర్డ్ డిఎస్‌పి నారాయణ స్వామిరెడ్డి అని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్దిక్ పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ఎనలేని సేవలో అందించి పదవి విరమణ చేసిన నారాయణ స్వామిరెడ్డికి ఆదివారం పట్టణంలోని కోటబడి హైస్కూల్, యూత్ కరాటే క్లబ్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించి దుశ్శాలువ కప్పి, పూల హారంతో మెమెంటో బహుకరించారు. ఈ సందర్భంగా అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ తమ సంస్థ మొదటి కార్యక్రమ ముఖ్య అతిథిగా, మదనపల్లెలో సిఐగా ఉన్న సమయంలో నారాయణ స్వామిరెడ్డి హాజరయ్యారన్నారు. పేరుకే సీఐ కానీ ఆయనలో ఎనలేని సామాజిక స్పృహ ఉందన్నారు. మదనపల్లె బెంగళూరు బస్టాండ్ ట్రాఫిక్ నియంత్రణలో ప్రముఖ పాత్ర, కరెంటు షాక్ తగిలి గాయపడిన యువకుడిని కాపాడిన సంఘటన, పుంగనూరు రోడ్లో జర్మనీ దేశస్తుల రోడ్డు ప్రమాదంలో వ్యవహరించిన శైలి, పోలీస్ శాఖలో పేదల పాలిట ఎంతో మందికి ఆర్థికంగా సహాయం అందించిన సేవలు ఆదర్శనీయమన్నారు. పదవీ విరమణ పొందిన డిఎస్పీ నారాయణ స్వామి రెడ్డి మాట్లాడుతూ మదనపల్లెతో తనకు ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన సంఘటనలను, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇకపై మదనపల్లె లోనే స్థిరపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కరాటే క్లబ్ మాస్టర్ మణి సాయి, నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ జి.కృష్ణమూర్తి, సంఘం శ్రీనివాసులు, నాగరాజ, కరాటే రమణ, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, దినకర్, చరణ్, రష్మిక, యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఉదయం 10 గంటల నుండి అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని పేర్కొన్నారు

రాష్ట్ర కౌన్సిల్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాయచోటి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభల పోస్టర్‌ను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ మహాసభలకు ఉద్యోగులందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఉద్యోగులు పలు సమస్యలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ఉద్యోగి ప్రశాంతంగా తమ విధులు నిర్వహించుకుంటున్నారన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఉద్యోగులు, పెన్షనర్లకు సక్రమంగా చెల్లింపులు

- జిల్లా ఖజానా శాఖ అధికారి మహబూబ్



ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ శాఖలలో పంపుతున్న బిల్లులను సకాలంలో పాస్ చేసి ఉద్యోగులు, పెన్షనర్లలకు వేతనాలు ప్రతి నెలా సక్రమంగా చెల్లిస్తామని జిల్లా ఖజానా శాఖ అధికారి సయ్యద్ మహబూబ్ పేర్కొన్నారు. జిల్లాలో ఖజానా శాఖ కార్యాలయాలు వివరాలు, కార్యాలయాల విధులు, సిబ్బంది కొరత, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతమంది ఉన్నారో ఎంత మందికి జీత భత్యాలు అంది స్తున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా ఖజానా కార్యాల యాలు తొమ్మిది ఉన్నాయి. జిల్లా ఖజానా కార్యాలయం జిల్లా కేంద్రం రాయచోటిలో ఉంది. ఉప ఖజానా కార్యాలయలు మదనపల్లి, తంబళ్లపల్లి, వాల్మీకిపురం, పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రాజంపేట, రైల్వేకోడూరులో ఉన్నాయి.

ఖజానా కార్యాలయంలో పనులు వివరాలు తెలపండి?

ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు, వివిధ శాఖలో బడ్జెట్లలో కేటాయించిన నిధులు చెల్లింపులు, ఉద్యోగు నిధులు చెల్లింపు అన్ని శాఖల ఉద్యోగులు వివరాలు, డేటా బేస్‌లో చేయించడం, రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్లు చెల్లింపులు వివిధ పద్ధతులు ద్వారా ప్రతినెల జరిగిన జమా ఖర్చులు వివరాలు అకౌంటెంట్ జనరల్ వారికి నివేదికలు అందించడం వంటి విధులు నిర్వహిస్తాం.

ఉద్యోగుల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 18,886 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. 10,187 మంది పెన్షనర్లు ఉన్నారు.

ట్రెజరీ చెల్లింపుల వివరాలు తెలపండి?

బిల్లులు పాస్ అయిన తర్వాత సిఎం పేషీ ద్వారా ఆర్‌బిఐ పేమెంట్‌కు బదిలీ ఇంచబడి ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో చెల్లించబడతాయి. ఇతనెల జిల్లాలో రూ.279,85,36,260 చెల్లిస్తాం.

పెన్షనర్లు, ఉద్యోగుల వేతనాలు పంపిణీలో సాంకేతిక సమస్యలు ఉన్నాయా?

సాంకేతిక సమస్యలు గతంలో తీవ్రంగా ఉండేవి ప్రస్తుతం అలాంటి సమస్యలు లేవు. పెద్ద సమస్యలు లేవు.

జిల్లాలో ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు జరుగుతుందా?

జిల్లాలో ప్రస్తుతం ఉద్యోగలలో బయోమెట్రిక్ అమలులో ఉంది. బయోమెట్రిక్ ను పరిశీలించి జీతభత్యాలు వేస్తున్నాం.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా ఖజానా కార్యాలయంలో మొత్తం 41 మంది ఉద్యోగులు అవసరం ఉండగా ప్రస్తుతం 21 మంది ఉద్యోగులు ఉన్నారు. కనీసం 30 మంది ఉన్నా బాగుంటుంది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బంది ఎక్కువ సమయంలో పనిచేసే ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు.

ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవాలి అనుకుంటున్నారా?

జిల్లాలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఏమైనా సమస్యలు ఉంటే ఉప ఖజానా కార్యాలయాల్లో సమస్యలు పరిష్కరించు కోవచ్చును. అక్కడ సమస్యలు పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రం కు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. త్వరలో అర్హులకు నూతన పెన్షన్లు, ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడం జరిగింది. దీంతో బాధితులు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


జెసిబితో తవ్విన రోడ్డు

మెటల్ రోడ్డు ఆక్రమణ అన్యాయం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సిద్ధారెడ్డిగారిపల్లె నుంచి సుండుపల్లెకు నిత్యం రాకపోకలు సాగించే మెటల్ రోడ్డును వెంకటరమణ అనే వ్యక్తి జెసిబితో తొలగించడం అన్యాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షలాది రూపా యలు ఖర్చు చేసి ప్రభుత్వం ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన ఈరోడ్డు ద్వారా రెడ్డన్నగారిపల్లి, సిద్ధారెడ్డిగారిపల్లి దళితవాడ ప్రజలు సుండుపల్లికి నిత్యం తమ వాహనాలలో రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. అలాంటి ఈ రోడ్డును జెసిపితో తొలగించడం చాలా బాధాకరమని అన్నారు. ఈ విషయాన్ని మండల అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమణ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గ్రామస్తులతో శ్రీకాంత్‌రెడ్డి

మంచాలమ్మ జాతరలో 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లె మండలలోని నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం, సుద్దల వాండ్లపల్లెలో జరిగిన మంచాలమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. వైసిపి నాయకులు రాజా, దివాకర్ ఇచ్చిన విందులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, వైసిపి కార్యకర్తలతో శ్రీకాంత్‌రెడ్డి మమేకమ య్యారు. అయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, రాయచోటి జడ్‌పిటిసి వెంకటేశ్వరరెడ్డి, మాజీ డిసిసిబి డైరెక్టర్ సేట్ వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ బిసి సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్, మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణారెడ్డి, పలవలి అమర నాధరెడ్డి, పేయల శివశంకరయాదవ్, జెసిసి ప్రతాప్‌రెడ్డి, రమణ, అంజి, రమేష్, ఓబులేసు పాల్గొన్నారు.

గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి


ప్రజాశక్తి-రామాపురం

మండలం లోని పాత రామాపురంలో ఆదివారం సిపిఐ శాఖ సమావేశం నాగేంద్ర నాయుడు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి సిపిఐ రాయచోటి నియోజ కవర్గం సిద్దిగాళ్ళ శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు సిసి రోడ్లు , వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రతి ఇంటికి కులాయి కనెక్షన్, జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మృతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సమితి మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మునాఫ్ మృతికి వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి నివాళులు అర్పించారు. పట్టణం లోని అలీ మాబాద్ వీధిలోని నివాసం ఉన్న అబ్దుల్ మునాఫ్ భౌతిక కాయా న్ని అయన సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యు లను పరామర్శించారు. గడికోట వెంట నాయకులు షబ్బీర్, సయ్యద్అమీర్, ఇనాముల్లా, యూసుఫ్‌ఖాన్, నాదర్, భుక్తియార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రాస్తులు

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కురబలకోట మండలం, కనసానివారిపల్లి గ్రామంలో ఉలసపల్లి గంగమ్మ జాతరకు గ్రామస్తుల ఆహ్వానం మేరక హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సిద్ధారెడ్డిగారిపల్లి, ఎగువపల్లి, దిగవపల్లి నల్లగుట్ల హరిజ నవాడ, నల్లగుట్లపల్లిల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనుల ను వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులు కార్యకర్తలు అధైర్య పడవద్దని తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆనంద్ రెడ్డి, నాయకులు అమరనాథ్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవి చంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్, బద్రి, బాబురెడ్డి పాల్గొన్నారు.

చెరువులో మట్టి తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


మాట్లాడుతున్న భాస్కర్

మండల పరిధిలోని ఊటుకూరు చెరువులో మట్టి తవ్వకాలు ఆపాలని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లా డుతూ ఊటుకూరు చెరువులో యథే చ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, దీనిపై తహశీల్దార్ పీర్‌మున్నీకి ఫిర్యా దు చేయగా అది తమ ఆధీనంలోకి రాదని, నీటిపారు దలశాఖ వారిని సంప్రదిం చాలని సూచించడం బాధ్యతారాహిత్యమని అన్నారు. వారు నీటి పారుదల శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారని తేలిగ్గా చెప్పడం బాధా కరమన్నారు. సంబంధిత శాఖ అనుమతులు ఇచ్చినప్పటికీ ఎన్ని ట్రిప్పులకు అనుమతులు ఇచ్చారో చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కేవలం ఆదివా రాలు మాత్రమే ఊటుకూరు చెరువులో మట్టి తరలిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి రాజంపేట మండలం ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటు న్నారని, ఇలాంటి పరిస్థితులలో కొందరు అక్రమార్కుల కారణంగా చెరువులో వేల ట్రిప్పుల మట్టి తరలిపోవడం వలన మరింత ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఊటుకూరు చెరువులో మట్టి తవ్వకాలపై సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్లు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం : 'కస్తూరి'

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అధైర్య పడవద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కస్తూరి విశ్వనాధనాయుడు పేర్కొన్నారు. ఆదివారం రంగంపల్లి పంచాయతీ ఆర్‌వడ్డిపల్లి గ్రామానికి చెందిన మదనపల్లి రవి ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద ఉన్న ఎన్.టి.రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అక్కడ నుంచి బైక్ పై ర్యాలీగా అప్పయ్య రాజుపేట మీదుగా ఆర్.రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వనాధనాయుడు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఏ కార్యకర్త కూడా నిరుత్సా హపడకుండా వారికి కష్టాలు ఎదురైనప్పుడు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసాని చ్చారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. రానున్న ప్రతి స్థానిక సంస్థల ఎన్నికల్లోను నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి విజయ ఢంకా మోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌బాబు, అనంతంపల్లి సర్పంచ్ మురళీరెడ్డి, ఓబులవారిపల్లి మాజీ జడ్‌పిటిసి రమణ, విశ్వేశ్వర నాయుడు, పెనగలూరు రమణారెడ్డి, ఫనిష్ కుమార్, రొంపిచర్ల మురళి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాధనాయుడు

దళిత విద్యార్థిపై దాడి అమానుషం


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్న ఓరంపాడు గ్రామ పంచాయతీ సి.కమ్మపల్లి దళితవాడలో దళిత నాయకులు సమావేశమై తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్ కిడ్నాప్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రకుల విద్యార్థులు సాయి, రూపేష్‌లు దళిత విద్యార్థి జేమ్స్‌ను కారులో ఎక్కించుకొని కాళ్లు, చేతులు కట్టేసి దారుణంగా కొట్టి అనంతరం నోట్లో మూత్రం పోయడం దారుణ మన్నారు. ఇలాంటి దారుణమైన సంఘ టనలో పోలీసులు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించడంతో పాటు అంబేద్కర్ జాతికి సంబంధించిన వాడివి అంటూ అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, హత్యా యత్నానికి ప్రయత్నించిన వారిపై అటెంప్ట్ మర్డర్ కేసును నమోదు చేయా లని డిమాండ్ చేశారు. కులాల మధ్య చిచ్చులు పెడుతున్న ఇలాంటి విద్యా ర్థులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాష్ట్ర రోకోలు చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు పొలంరెడ్డి మల్లికార్జున, భారత బహు జనసేన రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, పుల్లంపేట మండ ల నాయకులు గాజుల శీను, మన్యం బ్రహ్మయ్య, ముసలికొప్ప వాసుదేవయ్య, నరసింహులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయం



రాయచోటి : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-రాయచోటి

ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని జిల్లా అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ శైలజా పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ ఆధ్వర్యములో ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు తిరిగి ఆసుపత్రి వరకు కోవ్వుత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా మే నెల మూడవ ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కోవ్వుత్తుల స్మారక దినం నిర్వహిస్తాన్నారు. ఎయిడ్స్ వ్యాధితో చనిపో యరో వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వ్యాధి తో బాధపడుతూ ఉన్నారో వారికి మనోధైర్యాన్ని ఇస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్ట్ డైరెక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రజలు అధికారులు, యువకులు, విద్యార్థులు ప్రజల్లో చైత న్యం తీసుకొచ్చి నివారణకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమములో డిఎ పిసియు సిలర్ సాబ్, జిల్లా క్షయనివారణ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, నాగే శ్వర ల్యాబ్ సూపర్‌వైజర్ గంగన్న, ఐసిటిసి ల్యాబ్ టెక్నిషన్ శంకరబాబు, ఎఆర్‌టి స్టాఫ్ నర్స్ మధుబాబు, లింక్ వర్కర్ ప్రోగ్రాం జిల్లా రీసోర్స్ పర్సన్ అల్లా వలీ,ఎయిడ్స్ నివారణా ప్రోగ్రాం సిబ్బంది ఎఎన్ఎం ప్రవీణ, ఓ ఆర్ డబ్ల్యు చంద్రకళ, సుహాసిని, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు: హెచ్‌ఐవి, ఎయిడ్స్ తో మృతిచెందిన వారిని, వ్యాధితో జీవిస్తున్న వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేసే సామాజిక బాధ్యత మన అందరిపై ఉందని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి సంవత్స రం మే మూడవ ఆదివారం నిర్వహించుకునే అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం కార్యక్ర మంలో భాగంగా ఆదివారం పీలేరులో కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లా డుతూ సమాజములో హెచ్‌ఐవి, ఎయిడ్స్ వలన కలిగే శారీరక, సామాజిక ఆర్థిక నష్టాలపై అవగాహన కలిగి, వ్యాధి వచ్చిన తర్వాత బాధ పడేకంటే ఎయిడ్స్ బారిన పడకుండా జీవిద్దామని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, కోర్ ప్రాజెక్టు మేనేజర్ సుమలత, ఐసిటిసి కౌన్సెలర్ రవి, హసీనా, రాజమ్మ ,తులసి, శైలజ, మోహన మురళి, బాలాజీ పాల్గొన్నారు.

కళా బృందంచే అవగాహన

బి.కొత్తకోట : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ,నియంత్రణ సంస్థ, కృషి సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై కెసి నటరాజ్ కళాబృందం చేత ఆదివారం వారపు సంతలో నాటకముల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో కలసి జీవించాలి,ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖ వ్యాధులు, చికిత్స గూర్చి, కండోమ్ ఉపయోగం గూర్చి అవగా హన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌సి వైద్య అధికారి కిరణ్‌కుమార్, డాక్టర్ వెంకట్రామయ్య, ఐసిటిసి కౌన్సిలర్ ఆనంద్, ఎల్.టి లక్ష్మీ కాంత్, కృషి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యు భారతి ఎడ్యుకేటర్స్, మంజుల, ఉమాదేవి, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

వంతెనపై మట్టిని తొలగించాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

పెన్నానది వంతెనపై ఉన్న మట్టి, ఇసుకను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. జమ్మలమడుగు ముద్దనూరు ప్రధాన రహదారిలో పెన్నానది వంతెనపై వర్షం నీరు కిందికి పోయేందుకు అక్కడక్కడ రంధ్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కాలంలో ఇసుక, గ్రావెల్ అధికంగా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తోలడం వల్ల వంతెనపై ఇరు వైపులా రంధ్రాలు పూర్తిగా పూడిపోయి నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయింది. మూడు రోజుల నుండి వర్షాలు కురుస్తున్నాయి. పిల్లర్ల జాయింట్స్ వద్ద రబ్బర్లు పోయి వాటి ద్వారా నీరు కిందికి వెళ్ళేవి. శనివారం రబ్బర్లు వేయకుండా తాత్కాలికంగా జాయింట్స్ వద్ద తారు వేయడం వల్ల నీరు కిందకు వెళ్లలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో వంతెనపై నిలిచిన నీరు ద్విచక్ర వాహనాలపై పడటమే కాక , ప్రమాదాలకు కారణం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరగక మునుపే సంబంధిత అధికారులు వెంటనే వంతెనపై మట్టిని తొలగించి వర్షం నీరు కిందికి పోయే లాగా చూడాలని కోరుతున్నారు.

టిడిపిని ఇంగ్లీష్ దేశం పార్టీగా మార్చుకోవాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జీవో 85 ను తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన జీవోను రద్దు చేయలేదని, కాబట్టి తెలుగు దేశం పార్టీ పేరును ఇంగ్లీష్ దేశం పార్టీ అని మార్చుకుంటే సరిపోతుందని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కూటమి పాలనలో పాఠశాల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలని మూడు రకాల పాఠశాలలు ఉండడంతో అందరికి సౌకర్యంగా, సౌలభ్యంగా ఉండేవని తెలిపారు. వైసిపి పాలనలో శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ ఫ్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ అని ఆరు రకాల పాఠశాలు పెట్టి అయోమయం చేయడం జరిగిందన్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక వూడిపోయిందన్నట్లు టిడిపి కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యను 9 రకాలుగా విభజించి చీలికలు పేలికలుగా చేసిందని తెలిపారు. హైస్కూళ్లల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:40 బదులు 1:53 చేసిన ఫలితంగా 6,428 మంది ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డిఎస్‌సి ప్రశ్నార్థకం మారిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా జీవో 85 ను రద్దు చేయకపోగా మరింత పకడ్బందీగా అమలు చేస్తుందని చెప్పారు. టిడిపి కూటమి మాట తప్పిందని చెప్పారు. ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందని చెప్పారు. ప్రాథమిక పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని కోరారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలలో, ఉద్యోగాలలో 3 శాతం అదనపు మార్కులు కలపాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీని యథాతథంగా నిర్వహించి పాఠశాలలు తెరిచే లోపు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆరోపణలు చేస్తే దాడులా? : కడప మేయర్

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎమ్మెల్యే మాధవి కక్ష సాధింపు చర్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, ఆమెపై ఆరోపణలు చేస్తే ఆస్తులపై దాడులు చేయిసున్నారని మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని మున్సిపల్ గ్రౌండ్ ఉర్దూ స్కూల్ వద్ద కార్పొరేషన్ అధికారులు కూల్చివేసిన దుకాణాలను, స్థలాలను నగర ఆదివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ఘోర పరాజయం తప్పదని హెచ్చరించారు. వైసిపి నాయకుడు జయచంద్రరెడ్డిపై కక్ష సాధింపులో భాగంగా పది దుకాణాలను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూలదోయడం అన్యాయం, అరాచకం అన్నారు. జయచంద్ర రెడ్డి ఇటీవల ఎమ్మెల్యేపై ప్రెస్ మీట్‌లో మాట్లాడినందుకే కక్ష సాధింపు చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. సామాన్యుల దుకాణాలను కార్పొరేషన్ అధికారులతో కూలదోయించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కూటమి అరాచక పాలన పై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేకు రియల్ ఎస్టేట్ వారు కప్పం కట్టాలని, లేకుంటే వారికి అనుమతి నిరాకరిస్తున్నారని విమర్శించారు. కప్పం కట్టకపోతే అనుమతులు ఇవ్వకుండా ఎమ్మెల్యే అడ్డుకుటారని పేర్కొన్నారు. కడప ఎమ్మెల్యే అరాచకాలను మీడియా ద్వారా ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఆయన చెప్పారు. వైసిపి కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఎవరు భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని నాగసానిపల్లె, జయరాం పేటలో నూతన మారెమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలకు మాజీ ఎమ్మెల్యే శెట్టి పల్లె రఘు రామిరెడ్డి, జడ్‌పి చైర్మన్ రామ్ గోవింద్ రెడ్డి, వైసిపి జిల్లా జాయింట్ సెక్రెటరీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ డి.ఎల్. శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, సర్పంచులు రెడ్యం రామకృష్ణారెడ్డి,అమరేశ్వర్ రెడ్డి భూమన సుబ్బారెడ్డి, నాగ సాని పల్లె వైసీపీ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆర్‌టిసి ఆర్ఎం

ప్రజాశక్తి కడప అర్బన్

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆదివారం కడప ఆర్‌టిసి గెస్ట్ హౌస్‌లో ఆర్ఎం గోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కడప డిపోలోని సిబ్బంది, వర్కర్లు సమన్వయంతో పనిచేసి ఆర్‌టిసి అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. అధికారులకు, సిబ్బందికి ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

25 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సుండుపల్లి

ఈనెల 25వ నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు సాంబ, రెడ్డి శేఖర్, సలీం, అభిషేక్ శర్మ, తిరుపాల్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రం సుండుపల్లిలోని ఎంకెఆర్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు అందివ్వ నున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 23వ తేదీ లోపు తమ టీం ఎంట్రీలను 9963368120, 9010003938 ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాదులో ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ విద్యా శాఖలో అసంబద్ధ, అస్తవ్యస్త నిర్ణయాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమం లేకుండా కేవలం ఆంగ్లమాధ్యమంలో విద్యను కొనసాగించడం వల్ల విద్యార్థుల మానసిక, సృజనాత్మక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడంలో వెనుక బాటకు గురవుతున్నారని తెలిపారు. ఐదేళ్ల కాలంలో తెలుగు మాధ్యమం కోసం, నిర్లక్ష్యానికి గురవుతున్న తెలుగు భాష కోసం ఎన్నో పోరాటాలు చేశామని, కూటమి ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని కొనసాగించడంలో గత ప్రభుత్వ మార్గాన్ని అనుసరిస్తోందని పేర్కొన్నారు. మాతృభాషను రక్షించాలని కోరారు. వెంటనే స్పందించి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తో ఫోన్లో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ విషయమై తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో స్లాట్ రాష్ట్ర కోశాధికారి భోగా గంగాధర్, మద్దిలేటి రాయలసీమ జిల్లాల ఎస్‌ఎల్టిఏ బాధ్యులు జి.వేణుగోపాల్, సహదేవ రెడ్డి, మురళి, వెంకటరమణ, మధు, ప్రిన్సిపల్ రవిశంకర్, పిడి మధు, కడప జిల్లా ఐక్య వేదిక అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప శిల్పారామంలో సాయంత్రం సాంస్కృతిక కళావేదికపై కమలాపురానికి చెందిన చెదిపిరాళ్ల గ్రామానికి చెందిన పిల్లలుకు బుజ్జి బాబు మాస్టర్ చేత తర్ఫీదు పొందారు. వారు పిల్లలు తమ నైపుణంతో డప్పులు ఎంతో చక్కగా వాయించారు. అనంతరం కడప నగరానికి చెందిన మిను డాన్స్ అకాడమీ శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపద నృత్యాలు, సినీ నృత్యలుతో ప్రేక్షకులు ను అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని రాజులగురవాయపల్లి ఉన్నత పాఠశాలలో 2003 – 08 సంవత్సరంలో విద్యానభ్యసించిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించడం సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలరించుకుని ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి మాధవరెడ్డి ,వెంకట రమణ వెంకటరమణమ్మ సుబ్బారావు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

రాజ్యాంగ రక్షణలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చా కిరణ్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో ఉన్న జెవివి కార్యాలయంలో ఆదివారం లా సెట్ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పచ్చ కిరణ్ పాల్గొని లా సెట్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత దేశ ప్రజలకు రాజ్యాంగమే అత్యున్నతమైందన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు సమాన అవకాశాలు కల్పించారన్నారు. ం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ రెడ్డి మాట్లాడుతూ పలు రకాల పోటీ పరీక్షలకు, ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు జన విజ్ఞాన వేదిక, ఐలు సంఘాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అభ్యర్థులు అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు జూన్ 5న నిర్వహించే లాసెట్ పరీక్షకు సంబంధించి లా ఆప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ అవేర్నెస్ సబ్జెక్టుల పట్ల అవగాహన కల్పించారు. సబ్జెక్టులను పోటీ పరీక్షల నిపుణులు రవి , రాజు, రమణ, హరిత బోధించారు. లా స్టూడెం ట్స్ రాష్ట్ర కన్వీనర్ అహ్మద్ మాట్లాడుతూ లాసెట్ అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మోడ్‌లలో ప్రిపరేషన్ కోసం శిక్షణ ఇస్తున్నామన్నారు .కార్యక్ర మంలో జెవివి నాయ కులు సునీత, రాజశేఖర్ పాల్గొన్నారు.

పెరుగుతున్న 'కుందూ' ప్రవాహం

ప్రజాశక్తి - చాపాడు

నెల రోజులుగా తగ్గుముఖం పట్టిన కుందూ ప్రవాహం శనివారం ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షానికి క్రమేపి పెరుగుతూ ప్రవహిస్తుంది. ఆదివారానికి నదిలో 1000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. శనివారం ఎగువ ప్రాంతాలలో వర్షం పడటంతో నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాలలో వర్షం పడితే నదిలో ప్రవాహం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెల రోజుల నుంచి నదిలో నీటి ప్రవాహం క్రమేపీ తగ్గి తాగునీటి కొరత ఏర్పడే అవకాశం కనిపించింది. నదిలో నీటి ప్రవాహం పెరిగితే ఈనెల చివరిలో వరినారుల సాగు చేపట్టాలని రైతులు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం పెరగడంతో రజకులకు ఇబ్బందులు తప్పాయి .

క్రైం కార్నర్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

దంపతులపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పాత కక్షలు పెంచుకొని దంపతులపై కోడి కత్తులతో హత్యాయత్నానికి పాల్పడ్డ ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. నిమ్మనపల్లి మండలం, బండ్లపై పంచాయతీ, దుర్గంవారిపల్లి సమీపంలో గల అమ్మచెరువు గుంట క్రింద ఊరి వద్ద యర్రప్ప తన భార్య శ్యామల చిన్నబుజ్జితో కలసి నివాసం ఉంటు న్నారని అన్నారు. చిత్తూరు జిల్లా, చౌడేపల్లి మండలం, దిగువపల్లి పంచా యతీ, యానాదిపాల్యం, ఆర్ ఆర్ కాలనీకి చెందిన దేవరకొండ హను మంతుకు గత కొంతకాలంగా తనకు స్వయానా అన్న అయినా ఎర్రప్పతో పాత కక్షలు ఉన్నా యని తెలిపారు. అన్నపై కక్షను పెంచుకున్న హనుమంతు తన అన్న ఎర్రప్ప దుర్గంవారిపల్లి సమీపంలో కాపురమున్నారనీ తెలుసుకొని ఇదే అదునుగా భావించి తన స్నేహితులు దొమ్మిరి అశోక్, శివానంద్‌తో కలిసి దంపతులపై ఈనెల 16న సాయంత్రం రెండు కోడి కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నంకు పాల్పడ్డారని చెప్పారు. అనంతరం నిందితులు అక్కడ నుంచి పారిపోయారని అన్నారు. సంఘటనపై బాధితురాలు శ్యామల తండ్రి సరికింటి పాపన్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. వారి ఫిర్యాదు పై కేసు నమోదు చేసి నిందితులను ఈనెల 18న ఆదివారం ఉదయం నిమ్మనపల్లి మండలం పిట్టావాండ్లపల్లి క్రాస్ వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.